ఉచిత చేప పిల్లల పథకాన్ని కొనసాగించాలి


మాట్లాడుతున్న లెల్లెల బాలకృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల స్కీమ్‌ను కొనసాగించాలని మత్స్య సొసైటీల అకౌంట్‌లలో నగదును వెంటనే జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లెల్లల బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. బాలకృష్ణ మాట్లాడుతూ... ఈ విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, జిల్లా కలెక్టర్లకు జూన్ 24 నుంచి జూలై 1వ తేదీ వరకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. మత్స్యకారుల రాష్ట్రస్థాయి చైతన్య సభలను రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జూలై 16,17,18 తేదీల్లో నిర్వహిస్తున్నామని ఈ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన పద్మ, విజయ్, రమేష్, వెంకట్, శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అంబర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తొలుపునూరి కృష్ణాగౌడ్ సోమవారం వీహెచ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వీహెచ్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ... ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ సద్వినియోగం చేసుకుంటుందన్నారు. బడుగు బలహీన వర్గాల పక్షాన కాంగ్రెస్ పార్టీ అనే సందేశాన్ని ఇచ్చేలా పార్టీ శ్రేణులు వ్యవహరించాలన్నారు. నాయకులు లఖపతి యాదగిరిగౌడ్, నాగభూషణం, లక్ష్మణ్, సత్తిబాబు గౌడ్, టి.వెంకటేష్‌గౌడ్ కిశోర్, దిలీప్ పాల్గొన్నారు.

పైడి లక్ష్మయ్య, సంజీవరెడ్డి ఆదర్శప్రాయులు

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం

చిక్కడపల్లి: పైడి లక్ష్మయ్య, పీఎల్ సంజీవరెడ్డిలు ఈ తరానికి ఆదర్శప్రాయులని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం అన్నారు. రసమయి సాంస్కృతిక సంస్థ డాక్టర్ పైడి లక్ష్మయ్య ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన డాక్టర్ పైడి లక్ష్మయ్య, డాక్టర్ పీఎల్ సంజీవరెడ్డిల స్మారక పురస్కార ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీణా విద్వాంసురాలు ఈమని కల్యాణి, ప్రముఖ సినీదర్శకులు రేలంగి నరసింహారావు, ప్రభుత్వ విశ్రాంత ఉన్నతాధికారి వీడీ రాజగోపాల్, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జగదీష్‌బాబులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ... పైడిలక్ష్మయ్య ఎంపీగా ప్రజాసంక్షేమానికి పలు పథకాలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత చీఫ్ కమిషనర్ నరసింహప్ప, పద్మశ్రీ డాక్టర్ నారాయణ, రసమయి సంస్థ స్థాపకుడు ఎంకే రాము, సందీప్ పైడి, కళారత్న అవార్డు గ్రహీత, స్వరరమ్య వ్యాఖ్యాన పారంగత ఎంకేఆర్ ఆశాలత పాల్గొన్నారు.

ఉన్నతాశయమే లక్ష్యంగా ఉండాలి

కాచిగూడ: విద్యాజ్యోతిని ప్రజ్వలనతోనే సమాజంలో నెలకొన్న పేదరికం సమూలంగా నిర్మూలించవచ్చు అని తెలంగాణ పద్మశాలి అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (టిపోపా) రాష్ట్ర అధ్యక్షుడు గందూరి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పేద విద్యార్థులకు టిపోపా ఆధ్వర్యంలో రూ. 75 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేనేత వృత్తితో పాటు ఉన్నత విద్యలో కూడా పద్మశాలీల ప్రతిభ ప్రకాశించాలని ఆశించారు. చదువుకు పేదరికం అడ్డు కావద్దు అన్న ఉద్దేశ్యంతోనే విద్యాజ్యోతి పథకం ద్వారా అండగా నిలుస్తామని చెప్పారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు స్వామి, శిరందాస్ శ్రీనివాస్, మాచన రఘునందన్ పాల్గొన్నారు.

ఉన్నికోట బస్తీలో కమ్యూనిటీ హాల్ పనులు చేపట్టాలి

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ ఉన్నికోట బస్తీలో ప్రారంభించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు తొలుపునూరి రమేష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన ఉన్నికోట బస్తీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్లిలర్ల కోసం తీసిన గుంతల్లో వర్షం నీరు నిలిచిపోయి ప్రమాదకంగా మారడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీలు స్పందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జాబ్ కేలండర్ విడుదల చేయాలని ఆందోళన

చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా జాబ్ కేలండర్ విడుదల చేయకపోవడంలో అంతర్యమేమిటని నిరుద్యోగులు ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని లైబ్రరీ చౌరస్తాలో నిరుద్యోగులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు ప్రశాంత్‌కుమార్, జనార్థన్, శాంతి, శ్వేత మాట్లాడుతూ గ్రూప్–2లో 2000, గ్రూప్–3లో 300 ఉద్యోగాలను పెంచడంతోపాటు గ్రూప్–1లో 1:100ను ఎంపిక చేయాలన్నారు. కేబినెట్ నుంచి ఎలాంటి నిర్ణయం రాకపోవడంతో నిరుద్యోగులు నిరాశతో ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళపై దాడిచేసిన రౌడీషీటర్ల అరెస్టు

చిక్కడపల్లి: మహిళాపై దాడి చేసిన కేసులో ఇద్దరు రౌడీషీటర్లను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య సమాచారం మేరకు... నాగమయ్యకుంటలో నివాసం ఉండే అంజమ్మ, బాబురావు భార్యాభర్తలు. ఈ నెల 22వ తేదీన అక్కడే నివసించే ఇద్దరు రౌడీ షీటర్లు బాలకృష్ణ, అనిల్ అంజమ్మపై దాడి చేశారు. ఈ దాడిలో ఆమె గాయపరిచింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిని అరెస్ట్ చేశారు. వారిని సోమవారం నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా వారికి 14 రోజుల రిమాండ్‌ను విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించామని ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

కాచిగూడ: ఇంటర్ ఫస్ట్ ఇయర్ సప్లమెంటరీ పరీక్షలో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ సమాచారం మేరకు... బర్కత్‌పురా–రత్నానగర్ ప్రాంతానికి చెందిన ఎల్లయ్య కుమార్తె రిషిక(18) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇంటర్ పరీక్షలో ఫెయిల్ కావడంతో ఇటీవల ఇంటర్ సప్లమెంటరీలో 3 సబ్జెక్టులు పరీక్ష రాసింది. సోమవారం ఇంటర్ సప్లమెంటరీ రిజల్ట్స్ రావడంతో 3 సబ్జెక్టుల్లో రెండు పాసై ఒక సబ్జెక్టు ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపానికి గురైన రిషిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై ఫైనాన్షియర్ల పంజా?

- ప్రైవేటు ఫైనాన్స్‌ల బారిన పారిశుద్ధ్య కార్మికులు
- ఇంటికి చేరని నెల జీతం
- ఫైనాన్సర్ల వద్దే కార్మికుల బ్యాంకు ఏటీఎం కార్డులు
- 20 నుంచి 30 శాతం మేర బాధితులు
- మానవీయ కోణంలో పరిష్కరించాలని కోరుతున్న కార్మికులు



అంబర్‌పేట: పారిశుద్ధ్య కార్మికులపై ప్రైవేటు ఫైనాన్షియర్లు పంజా విసురుతున్నారు. వారి రెక్కల కష్టం దోచుకుంటున్నారు. వారి అవసరాలని బలహీనతగా మార్చుకొని అధిక వడ్డీకి అప్పు ఇచ్చి అందిన కాడికి దోచుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పరిసరాలను పరిశుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికుల నుంచి అధిక వడ్డీ వసూలు చేసి జలగల్లా వారి జీతాలను కొల్లగొడుతున్నారు. నెల మొత్తం కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికులు నెల మొదటి తేదీకి ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

- జీతం కోసం కష్ట పడుతున్న కార్మికుల జీతాన్ని వడ్డీ వ్యాపారులు కొల్లగొడుతున్నారు. చిన్న చిన్న అవసరాలకు అప్పు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వారికి వచ్చే జీతాలు వడ్డీ వ్యాపారుల పాలవుతున్నాయి. దీనిపై ఎవరికి చెప్పుకోవాలి అర్థంకాని పరిస్థితి నెలకొంది. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించి మానవీయ కోణంలో తమ సమస్యలను పరిష్కరించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

వడ్డీ వ్యాపారి వద్దే ఏటీఎం కార్డు...

పారిశుద్ధ్య కార్మికులకు జీహెచ్ఎంసీ జీతం బ్యాంకుల్లో జమ చేస్తుంది. జమ అయిన జీతం డబ్బులు పారిశుద్ధ్య కార్మికులు తీసుకోలేని పరిస్థితి ఉంది. వీరి బ్యాంకు ఏటీఎం కార్డులను వడ్డీ వ్యాపారులు వడ్డీకి డబ్బులు ఇచ్చినపుడే తీసుకుంటున్నారు. జీతం పడినట్లు తెలుసుకొని వడ్డీ వ్యాపారులే కార్మికుల ఏటీఎం కార్డు ద్వారా వారి డబ్బులను డ్రా చేసుకుంటున్నారు. ఒప్పందం ప్రకారం ఏమైనా కొద్ది మొత్తంలో వడ్డీ వ్యాపారి ఇస్తే తీసుకొని ఇంటికి వెళుతున్నారు. అసలు కంటే వడ్డీ వీరు ఎక్కువగా చెల్లిస్తుండటంతో వారి రుణం తీరడం లేదు. దీంతో కార్మికులు వడ్డీ వ్యాపారుల బారిన పడి నలిగిపోతున్నారు.

మెజార్టీ పారిశుద్ధ్య కార్మికులు...

అంబర్‌పేట జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో సుమారు 800కు పైగా పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వీరిలో 20 నుంచి 30 శాతం కార్మికులు వడ్డీ వ్యాపారుల బాధితులు లేకపోలేదు. పారిశుద్ధ్య కార్మికుల కుటుంబంలో చిన్న అపద వచ్చినా... చిన్న శుభకార్యం జరిగిన చేతిలో అదనంగా డబ్బులు లేకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వీరి అవసరాలను ఆసరా చేసుకొని వడ్డీ వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కార్మికుల అవసరాలకు తీసుకొనే అప్పుపై పది శాతం వడ్డీ విధిస్తున్నారు. అధిక వడ్డీ తీసుకోవడంతో వాళ్లకు వచ్చే జీతంలో చెల్లించే డబ్బులు వడ్డీకే పోతున్నాయి. దీంతో అసలు అప్పు తీరక ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు.

కార్మికులను వేధిస్తే చర్యలు తథ్యం

వడ్డీ వ్యాపారుల ఆగడాలపై నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. ఆయా విషయాలు మా దృష్టికి వస్తే నిందితులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు అలాంటివి మా దృష్టికి రాలేదు. కార్మికులను ప్రైవేటు ఫైనాన్షియర్లు వేధిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

– రఘు, కాచిగూడ ఏసీపీ

4 లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ధర్నా

అసెంబ్లీలో తీర్మానం చేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

చిక్కడపల్లి: కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం 4 లేబర్ కోడ్స్‌లకు వ్యతిరేకంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్మికశాఖ అదనపు కమిషనర్‌కు గంగాధర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను మరింత వేగవంతం చేసిందన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన మొదటి మీటింగ్‌లోనే గతంలో అక్రమంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను అమలకు పూనుకుందని మండిపడ్డారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా గత నాలుగేళ్లుగా దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాటం చేస్తున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మిక సమస్యలను హక్కులను హరిస్తే కార్మిక వర్గం తిరగ పడుతుందన్నారు. ఐఎఫ్‌టీయూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శులు అరుణ, మల్లన్న, మణమ్మ, మంగళ, సత్యనారాయణ, కుమార్, సరోజ, లీలా, మంజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధు నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

బీఎల్ఎఫ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు దండి వెంకట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రైతు బంధు నిధుల దుర్వినియోగంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్ఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వ్యవసాయేతర భూములైన రియల్ ఎస్టేట్, ఫామ్‌హౌజ్‌లు, గుట్టలు, ప్రభుత్వ భూములకు సైతం రైతు బంధులు నిధులు అందినట్లు విచారణలో తేలితే ఆ నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం, విద్యుత్ సరఫరా కొనుగోళ్లపై రాష్ట్ర కమిషన్ వేసినట్లుగానే రైతు బంధు నిధుల దుర్వినియోగంపై కూడా విచారణ కమిషన్ వేయాలని కోరారు. 22 వేల కోట్ల రూపాయలు వివిధ రంగాలకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సినీరంగానికి చెందిన స్టూడియోలకు, ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలకు రైతు బంధు ఇవ్వడం ద్వారా నిధుల దుర్వినియోగం జరిగినట్లు మీడియా సాధనాల్లో వార్తా కథనాలు సైతం వచ్చాయని తెలిపారు. వాటిపైనా కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి ప్రజల సొమ్మును దోచుకున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక దోపిడీని కప్పి పుచ్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే భవిష్యత్తు పరిణామాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

రోడ్డును ఆక్రమించిన తోపుడు బండ్లను తొలగించాలి: ఎన్‌సీపీ

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం పరిసర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న రోడ్లకు ఇరువైపులా వెలసిన తోపుడు బండ్లను తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ (ఎన్‌సీపీ) ప్రతినిధులు జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జీహెచ్ఎంసీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీవాత్సవకు ఎన్‌సీపీ ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేశారు. అనంతరం నల్లకుంటలో ఎన్‌సీపీ అధ్యక్షుడు వి.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి డి.మోహన్‌నాయుడు మాట్లాడుతూ... శంకరమఠం మార్కెట్ రోడ్డు విస్తీర్ణం సుమారు 50 నుంచి 60 ఫీట్లు ఉంటుందన్నారు. గతంలో ఈ రోడ్డులో ఒక్కో వరసలో తోపుడు బండ్లు మాత్రమే ఉండేవని, కాగా ఇప్పుడు పోటాపోటీగా ఒక్కొక్కరు రోడ్డును సగానికి పైగా ఆక్రమించి మూడేసి తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. దీంతో రోడ్డు కిరువైపుల అక్రమంగా వెలసిన తోపుడు బండ్ల కారణంగా రోడ్డు కుంచించుకుపోయి నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్న విషయాన్ని అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు. ఈ కారణంగా స్థానిక నివాసులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని కమిషనర్‌కు వివరించామని తెలిపారు. స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్‌సీపీ ఉపాధ్యక్షుడు భవానీశంకర్, సలహాదారు డాక్టర్ జయసూర్య, కోశాధికారి పి.శ్రీనివాస్‌రావు, సహాయ కార్యదర్శి అశ్విన్, నిర్వహణ కార్యదర్శి వీరయ్య, సహాయ కార్యదర్శులు వెంకట స్వామి గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'కళ్యాణలక్ష్మి, షాదీముబారక్' పేదలకు వరం


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్: ప్రతి ఇంట్లో జన్మించిన ఆడ పిల్లకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఓ వరం లాంటివని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రాంనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ కమ్యూనిటీ హాల్‌లో చెక్కులను పంపిణీ చేశారు. ముషీరాబాద్, హిమాయత్‌నగర్ మండల పరిధిలో మొత్తం 136 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు ఆర్.మోజెస్, కొండా శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాకేష్ కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జిముచ్చకుర్తి ప్రభాకర్, తహసీల్దార్లు రఘు, విష్ణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడిక్‌మెట్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి


అడిక్‌మెట్ రామాలయం వీధిలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ రామాలయం వెనక వీధిలో గత కొన్ని నెలలుగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జలమండలి డీజీఎం మోహన్‌రావుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎమ్మెల్యే తనయుడు ముఠా జైసింహ, డీజీఎం మోహన్‌రావులతో కలిసి బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు కొత్త డ్రైనేజీ పైపులైన్‌ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలమండలి డీజీఎంతో మాట్లాడి పైపులైన్‌ల కోసం నిధులు మంజూరు చేయిస్తానని ముఠా జైసింహ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు విన్నుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు రాష్ట్రాలకు అప్పగించాలి

కాచిగూడ: నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తి విఫలమైందని ఆరోపించారు. నీట్ పరీక్షను రద్దు చేసి 24 లక్షల మంది అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలన్నారు. విద్యపట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరితో వైద్య విద్యపై విద్యార్థులు విశ్వాసం కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ వైద్య విద్య పట్ల ప్రపంచ దేశాలకు ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉండేదని, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, పరీక్షలో అవకతవకలు జరగడంతో దేశ ప్రతిష్ట పూర్తిగా దిగజారిపోయిందని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి కారకులైన వారిపై దేశద్రోహం కింద శిక్షించాలని వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం నేతృత్వంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు బలరామ్, మణికంఠ, వంశీ, ప్రవీణ్, యువరాజ్, ధరం, రుద్ర తదితరులు పాల్గొన్నారు.

28న సీఎం ఇంటిని ముట్టడిస్తాం

లక్డీకాపూల్: లంబాడీ సామాజిక వర్గానికి కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంలో మంత్రి పదవి ఇవ్వాలని లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గణేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘాలు రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను సాధించుకునే క్రమంలో ఈ నెల 28న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామనని హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలన అందిస్తామని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలో లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఒక్కరంటే ఒక్కకికి కూడా మంత్రులు లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తుందన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


సీతయ్య

చిక్కడపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. సోమవారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దర్భరమవుతున్నాయని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని , గంజాయిపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనే తమ ధ్యేయమన్నారు. మత్తుపదార్థాలకు బానిసలుగా మారి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులకు మానసిక క్షోభకు గురికాకుండా చూడాలని పేర్కొన్నారు.

కృష్ణానగర్ బస్తీ అధ్యక్షుడిగా శాంతికుమార్



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ కృష్ణానగర్ బస్తీ అధ్యక్షుడిగా వై.శాంతికుమార్ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన బస్తీ ఎన్నికల్లో తన ప్రత్యర్థి కాదాసి నర్సింగ్‌రావుపై రెండవసారి 136 ఓట్ల మెజార్టీతో భారీ విజయాన్ని నమోదు చేసుకున్నారు. మొత్తం 450 ఓట్లు పోల్ కాగా నాలుగు ఓట్లు చెల్లదేదు. వై.శాంతికుమార్‌కు 291 ఓట్లు రాగా, కె.నర్సింగ్‌రావుకు 155 ఓట్లు వచ్చాయి. తనను భారీ మెజార్టీతో గెలిపించిన బస్తీ ప్రజలకు శాంతికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

27న బొజ్జా తారకం జయంతి

కాచిగూడ: పీడిత ప్రజల గొంతుక, సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం 85వ జయంతి పుస్తకాల ఆవిష్కరణ సభ ఈ నెల 27వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుందని బొజ్జా తారకం ట్రస్ట్ సమన్వయ కర్త గనుమల జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనతో తెలిపారు. రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ మాజీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ చంద్రయ్య, ప్రొఫెసర్ జి.సత్యనారాయణ, ప్రొఫెసర్ సుధారాణి, న్యాయవాది నిమ్మ నారాయణ, రచయిత్రి కొండవీటి సత్యవతి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా 'బుద్ధుని ప్రవచనం', 'బొజ్జా తారకం వ్యాసాలు', 'స్వతంత్ర భారతదేశం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా..?' అనే పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుందని ఆయన తెలిపారు.

కేటాయించిన స్థలంలోనే వాహనాలను పార్కింగ్ చేయాలి

ముషీరాబాద్: భోలక్‌పూర్ దేవుని తోటలోని ప్రసిద్ధిగాంచిన భవానీ శంకర దేవాలయంలో టెండర్‌లో పార్కింగ్ స్థలాన్ని కైవసం చేసుకున్న వారు దేవాలయ శాఖ కేటాయించిన స్థలంలోనే వాహనాల పార్కింగ్ చేయాలని దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాస్ శర్మ సూచించారు. సోమవారం భోలక్‌పూర్‌లోని భవానీ శంకర దేవాలయంలో గల ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్‌కు గాను టెండర్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుడైన కార్తీక్ రూ. 5.37 లక్షలకు పార్కింగ్ స్థల కాంట్రాక్ట్ కై వసం చేసుకున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే రెండు లక్షలు అధికంగా దేవాదాయ శాఖకు ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఆకట్టుకున్న రాఘవన్ కర్ణాటక సంగీత అరంగేట్రం


కర్ణాటక సంగీతంలో అరంగేట్రం చేస్తున్న రాఘవన్, మాధవన్ మాడభూషి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాఘవన్ మాడభూషి కర్ణాటక సంగీత అరంగేట్రం ఆకట్టుకునేలా సాగింది. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ మ్యాండలింగ్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రాఘవన్ మాడభూషి తన సోదరుడు మాధవన్ మాడభూషిలు మ్యాండలింగ్ వాయిద్యంతో సభికులను రంజింపజేశారు. మొదటగా నవరాగ మాలిక వర్ణం, వాతాపి గణపతి, రాగం తానం పల్లవి రాగమాలికల వాయిద్యంతో ఉర్రుతలూగించారు. ఈ సందర్భంగా రాఘవన్ గురువులు యు.పి.రాజు, యూ.పి. నాగమణి మాట్లాడుతూ... గత పది సంవత్సరాలుగా ఆన్‌లైన్‌లో కర్ణాటక సంగీతం నేర్చుకొని శభాష్ అనిపించుకున్నారని చెప్పారు. ఇలాంటి కళాకారులు దేశానికే గర్వకారణమన్నారు. ఘటంపై డాక్టర్ కార్తీక్, మృదగంపై డాక్టర్ రామకృష్ణ నీలమణి, వాయిలిన్‌పై శ్రీనివాసరావు, తాంబూరాపై విఘ్నేష్‌లు వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో రాఘవన్ తల్లిదండ్రులు డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసై చోరీలు

ముగ్గురు మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించిన పోలీసులు

హిమాయత్‌నగర్: మత్తు పదార్థాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న మైనర్లను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సైదాబాద్‌లో నివాసం ఉండే ఏ1(15),ఏ2(15), ఏ3 (12) ఈ ముగ్గురు మైనర్లు జల్సాలకు అలవాటు పడి, గంజాయి,మద్యానికి బానిసై చోరీలు చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా, ఆమన్గల్‌కు చెందిన సంతోష్ ఆటో డ్రైవర్ ఈ నెల 21న హిమాయతనగర్‌లో ఆటో నిలుపుకొని చేతిలో ఫోన్ పట్టుకుని కూర్చున్నాడు. చోరీ చేసిన హోండా యాక్టివపై ముగ్గురు మైనర్లు సంతోష్ వద్దకు వచ్చి అతని చేతిలో ఉన్న ఫోన్‌ను లాక్కొని పారిపోయారు.దీంతో బాధితుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని సంఘటన స్థలంలో ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వాహనాలు తనిఖీలు చేస్తుండగా నారాయణగూడ వైఎంసీఏ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఈ ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఈ ముగ్గురిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్, 2 బైక్‌లను స్వాధీనం చేసుకుని జువైనల్ హోం తరలించినట్లు ఏసీపీ శంకర్ తెలిపారు.

విద్యాపరమైన సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలి


విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న చెన్నయ్య, వెంకటేశ్వర్ ముదిరాజ్

కాచిగూడ: సాంకేతికత, ఇంటర్నేట్, సోషల్ మీడియాను వినియోగించుకుని సేవా సంస్థలు జనంలోకి వెళ్లాలని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పాట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతి సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అతి తక్కువ శ్రమతో ఎక్కువ మందిలోకి వెళ్ళే సేవా కార్యక్రమాలకు రూపకల్పన చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం మొబైల్ గ్రంథాలయాల ఏర్పాటు, డిజిటల్ క్లాస్ రూమ్‌ల నిర్వహణను చేపట్టాలని సూచించారు. అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న అనే సామెత ఉన్నా మారిన ప్రస్తు పరిస్థితుల దృష్ట్యా అన్నదానం కన్నా కూడా విద్యాదానం మిన్న అని పేర్కొన్నారు. విద్యాపరమైన సేవా కార్యక్రమాల నిర్వహణకు తెలంగాణ ప్రగతి సేవా చారిటబుల్ ట్రస్ట్ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పి.సతీష్ గౌడ్, పి.నర్సింగ్‌రావు, జె.శ్రీనివాస్ గౌడ్, వి.శకుంతల ముదిరాజ్, యు.చెన్నయ్య ముదిరాజ్, వెంకట్ దాసు, వి.నర్సింగ్‌రావు, ముదిరాజ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి

కాచిగూడ: బోనాల వేడుకలను భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని దేవాదాయ శాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ కె.ఎస్.సంధ్యారాణి సూచించారు. సోమవారం కాచిగూడ తుల్జాభవన్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఆలయాల నిర్వాహకులతో బోనాల వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద ఏర్పాట్ల కోసం ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బోనాల వేడుకలకు ప్రభుత్వ పరంగా ఆలయాలకు నిధులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బోనాల వేడుకల్లో ఆలయాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు. గాంధీనగర్ ఏసీపీ వై.మొగిలయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ కె.శంకర్, హిమాయత్‌నగర్ తహసీల్దార్ డి.సంధ్యారాణి, సీనియర్ అసిస్టెంట్ కె.మంజుల, ఆలయాల నిర్వామకులు నల్లవెల్లి అంజిరెడ్డి, పందిళ్ల ప్రసాద్, కాచిగూడ, ముషీరాబాద్, దోమలగూడ, చిక్కడపల్లి, గాంధీనగర్, తదితర పోలీస్ స్టేషన్ల సిబ్బంది, జీహెచ్ఎం సానిటేషన్ సిబ్బంది, ఎంటోమెంట్ ఈవోలు, ఇన్‌స్పెక్టర్లు తదితర విభాగాల సిబ్బంది, పాల్గొన్నారు.